Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 172 | Monday : 16.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :172 | సోమవారం 16 జూన్ 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774



## పుణెలో ఘోర ప్రమాదం

- నదిలో కూలిన వంతెన..
- అనేక మంది గల్లంతు!
- వీరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఆరుగురిని స్థానికులు రక్షించినట్లు సమాచారం
- మిగతావారి కోసం గాలింపు



## ఆత్మరక్షణ కోసమే ప్రతిదాడులు..

- అందుకు అంగీకరిస్తే ఆపేస్తాం
- ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాక్చీ వెల్లడి
- పరిస్థితులు డిమాండ్ చేస్తే తప్ప ఇజ్రాయెల్‌తో వివాదాన్ని పొరుగుదేశాలకు విస్తరించాలని ఇరాన్ భావించడం లేదు
- మరోవైపు టెహ్రాన్ అణ్వాయుధాలు తయారు చేస్తే తమకు ముప్పు ఉంది
- దానిని అడ్డుకునేందుకే అణు స్థావరాలపై దాడులు చేస్తున్నాం



## ప్రతి సోమవారం విద్యుత్తు ప్రజావాణి

- గృహజ్యోతి పథకం అమలుకాకపోయినా, రీడింగ్‌లో తప్పులున్న ఫిర్యాదు చేసేయొచ్చు
- అవగాహన లేక ముందుకు రాని వినియోగదారులు
- విద్యుత్తు ప్రజావాణిని ఉపయోగించుకోవాలని కోరుతున్న అధికారులు
- ప్రచారం చేయని కారణంగా ప్రజలకు తెలియడం లేదు
- ఎక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం

### ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్‌పై

# జీఎస్టీ తగ్గించండి

- పీయూష్ గోయల్‌ను కోరిన చంద్రబాబు
- రాష్ట్రంలోని వివిధ అంశాలపై సీఎం, కేంద్రమంత్రి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.
- పొగాకు ధరలు తగ్గినందున రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నట్టు వెల్లడి
- బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- పొగాకు కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు ఖర్చు చేస్తోందని
- టొబాకో బోర్డు రూ.150 కోట్లు భరించేలా చూడాలన్నారు.



**చిత్తూరు ఎక్స్ ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ని సీఎం చంద్రబాబు భోజనానికి ఆహ్వానించారు. దీంతో వారిద్దరూ ఉండవల్లిలోని సీఎం నివాసానికి చేరుకున్నారు. అనంతరం లంచ్ మీటింగ్‌లో ఏపీకి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు, పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపు, ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్ పై జీఎస్టీ తగ్గింపుపై చర్చించారు. టొబాకో బోర్డు ద్వారా ఏపీలో పొగాకు కొనుగోళ్ల నిమిత్తం రూ.150 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విన్నవించారు. పొగాకు ధరలు తగ్గిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.300 కోట్లతో 20 మిలియన్ కేజీలు కొనుగోలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఏడు చోట్ల పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని సీఎం చంద్రబాబు వివరించారు. పొగాకు కొనుగోళ్ల - మిగతా3లో



## తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమే

- గోదావరి - బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ కారణంగా గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ
- ఏపీ తీసుకుంటున్న చర్యలు.. 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంతోపాటు నది జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘిస్తుంది
- దీనిపై వెంటనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్రాన్ని కోరాలి

**చిత్తూరు ఎక్స్ ప్రెస్, హైదరాబాద్**

గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. అలాంటి వేళ.. తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదివారం లేఖ రాశారు. గోదావరి - బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ కారణంగా గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం - మిగతా3లో

### నెలాఖరులోగా స్థానిక సంస్థల

# ఎన్నికల షెడ్యూల్

**ముందు పరిషత్, ఆ తర్వాత పంచాయతీ..**

**15 రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్..**



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు
- స్థానిక ఎన్నికలకు 15 రోజుల గడువు మాత్రమే ఉంది
- కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పొంగులేటి సూచన గ్రామాల్లో చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుని ముందుకెళ్లాలి
- గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థులనే ఎంపిక చేస్తాం

3



## నేడు కేబినెట్ సమావేశం

### ఎన్నికల షెడ్యూల్‌పై చర్చ!

### ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చర్చ

**చిత్తూరు ఎక్స్ ప్రెస్, హైదరాబాద్:**

తెలంగాణ కేబినెట్ సోమవారం(రేపు) మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం కానుంది. కేబినెట్ సమావేశంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో, ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే చర్చ మొదలైంది. మరోవైపు.. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో చర్చించిన అనంతరం ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. స్థానిక ఎన్నికలకు 15 రోజుల గడువు మాత్రమే గడువుందని.. కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని చెప్పారు.

Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# బోయకొండపై తరగని భక్తుల రద్దీ





**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**
శక్తిక్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు ముగిసినప్పటికీ రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణల నుంచి అధికసంఖ్యలో భక్తులు తర లివచ్చారు. దీంతో బోయకొండ భక్తజన సంద్రమైంది, ఆలయ ఈవో ఉపకమిషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో అధికారసిబ్బంది. అర్చకులు బోయ కొండ ఆలయం కిందగల భవానినగర్ తదితర ప్రాంతాల్లో భక్తులకు వివిధ ప్రాంతాలనుంచి అధికసంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూ లైన్‌లన్నీ భక్తులతో కిటకిటలాడాయి,ఈ సందర్భంగా అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరంవచ్చిన భక్తులకు ఈవో ఏకాంబరంమరియుఅర్చక సిబ్బంది. తీర్థ ప్రసాదాలు అందించడం జరిగింది క్యూలైన్లలో మరియు దేవస్థాన ప్రాంగణాల్లో ఎటువంటి అంతరాయం కలగకుండా ఈవో ఏకాంబరం జాగ్రత్తలు చేపట్టారు. మైకులలో అనౌన్స్మెంట్ కూడా దొంగలు ఉన్నారు. అని మీ వస్తువులకు మీరే బాధ్యులు అని వివిధ జాగ్రత్తలతో భక్తుల కు తెలియపరుస్తూఉన్నారు. కొంత మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది.

# కళాజ్యోతి జాతీయపురస్కారాలు అందుకున్న పీలేరు వాసులు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**
అన్నమయ్యజిల్లా పీలేరుఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంగా ఆదివారం జరిగిన, కళాజ్యోతి జాతీయ పురస్కారాల ప్రధనోత్సవంలో పలువురు పీలేరు వాసులు అవార్డులను అందుకున్నారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవి కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో "తెలుగుతేజాలకు కళాభిషేకం " కళాకారుల సమ్మేళనం "కళాజ్యోతి జాతీయ పురస్కారాలు - 2025 కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ హాస్యనటుడు, నటకిరీటి రాజేంద్రప్రసాద్, సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్యం శర్మ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ప్రముఖ రచయిత, వక్త డాక్టర్ నారాయణ స్వామి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ అధ్యక్షులు ఎంవి శ్రీధర్ రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు మద్రిపూడి దేవేంద్రరావు కవులు, కళాకారులకు పుర స్కారాల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పీలేరుకు చెందిన ప్రముఖ పద్యకవి జలకనూరి మురళీధర్రాజు, కవిసరస్వతి శ్రీరామరాజు, కళాకారుడు, ఉపాధ్యాయుడు బి. చంద్రశేఖర్,ప్రముఖ అంతర్జాతీయ బహుభాషా నాటక కళాకారుడు ఖాదర్ బాష షేక్, విశ్రాంత డిప్యూటీ తహశీల్దారు వెంకట శేషయ్యలు జాతీయ పురస్కారాలు అందుకున్నారు.

# గంగమ్మ జాతరలలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**
పలమనేరు మండలం, మున్సిపల్ పరిధిలో జరిగిన గంగమ్మ జాతర్లకు పలమనేరు శాసన సభ్యులు అమర్నాథ్ రెడ్డి ఆదివారం హాజరయ్యారు. పలమనేరు మున్సిపాలిటీ నీళ్ళకుంట గ్రామంలో గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరకు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆయన అమ్మవారి పూజలో పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ దుగ్గినవారిపల్లిలో జరిగిన గంగమ్మజాతరలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సంతోషంగా ఉండేలా ఆ అమ్మవారి చల్లనిచూపు మన పై చూపాలని ఆయన వేడుకు న్నారు. జాతర నిర్వాహకులు ఆయన్ను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాల ను అందజేశారు. ఈ కార్యక్రమాలలో పట్ట ణనాయకులు గిరిబాబు, శ్రీనివాసులు, సుధాకర్, శంకరాయ్య, పురుషోత్తం మరియు మండల నాయకులు వెంకట రత్నం, గణేష్, రామూర్తినాయుడు, భాస్కర్, హేమ సుందరం, నరేష్‌రెడ్డి, వినోద్, వెంక టేష్, దయ, అమరనాథ రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతి సన్నిధానం వద్ద సంకటహార చతుర్థి హోమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**



శ్రీకాళహస్తి ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళ హస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు సంకట హరా చతుర్థి సందర్భంగా దేవ స్థానం ప్రాంగణంలో ఉన్న శ్రీ అంజంజి గణపతి కన్యమూల గణపతి సన్నిధానం వద్ద దేవస్థానం ముఖ్య అర్చక ఎస్ఎంకె శ్రీను గురుకుల్ ఆధ్వర్యంలో దేవస్థానం అధికారులు సంకటహర చతుర్థి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో ఎన్.ఆర్ కృష్ణారెడ్డి దంపతులు, సూపర్డెంట్ నాగభూషణం యాదవ్, ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

# దుర్యోధన వద కార్యక్రమం

**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**



వెదురుకుప్పం మండలం పచ్చికాపలంలో జరుగుతున్న 95వ వార్షిక మహాభారత మహోత్సవంలో భాగంగా ఆదివారం దుర్యోధన ప్రతిమ దగ్గర, భీమ, దుర్యోధన యుద్ధ సన్నివేశాలు. కార్యక్రమం నిర్వహి స్తున్న దృశ్యం, తిలకిస్తున్న స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కిట్లు పంపిణీ కార్యక్రమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**



శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కిట్లు పంపిణి కార్యక్రమంను పలు గ్రామాలకు స్వయంగావెళ్లి జనసేన పార్టీ కుటుంబసభ్యులకు సభ్యత్వకిట్లను పేట బ్రదర్స్ పంపిణీచేశారు.పార్టీ ఇచ్చేటు వంటి భరోసాగురించి సభ్యులకు అవగా హన కల్పించారు.ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇంచార్జ్ పేట చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ప్రదీప్ కుమార్, మహేష్, మనీ, పేట చిరంజీవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా మారిన గ్రామీణ రహదారి విషయమై

## పలమనేరు నియోజకవర్గ శాసనసభ్యులకు గ్రామస్తులు వినతి



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**
పలమనేరురూరల్ మండలంకొలమాసన పల్లి బస్టాండ్ నుండి నెలపట్ల గ్రామానికి వెళ్లే తారు రోడ్డు ప్రస్తుతంవాహన రాకపోకల వల్ల మట్టి రోడ్డుగా మారింది గులక తేలింది,రాకపోకలకు సమస్యగామారింది ప్రయాణికులు కన్నీళ్లుపెట్టుకుంటున్నారు. వాహనదారులు ప్రమాదానికి లోనవుతున్నారు. ఇదివరకే 108 వాహనాల్లో పలు ప్రమాదాలకు లోనైనా అనేక మందిని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత నియోజక వర్గం శాసనసభ్యులు స్పందించాలని, గ్రామీణ రహదారిని చక్కదిద్దాలని, కొలమాసన పల్లి గ్రామానికి చెందిన పలువురు వినతి పత్రం అందజేశారు.

# పాఠశాలల వాహనాల తనిఖీ




**శ్రీకాళహస్తి, చిత్తూరుఎక్స్ ప్రెస్, జూన్15:**
శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుప్రైవేటు పాఠశాలల వాహనాలను సీఐ నాగార్జునరెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలు పునః ప్రారంభం అయిన నేపథ్యంలో బస్సులను మంచి కండిషన్‌లో ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని బస్సులను ఎప్పటికపుడు తనిఖీచేసి ఎలాంటి మరమ్మతులు లేకుండా చూసుకో వాలన్నారు. పాఠశాలల బస్సులు నడిపే డ్రైవర్లు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు.అదే విధంగా డ్రెస్‌కోడ్ పాటించాలన్నారు.తాగివాహనం నడిపితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక ట్రాఫిక్‌నియమాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఓవర్‌టేక్ వంటివి చేయకూడదన్నారు. డ్రైవర్‌తో పాటు విద్యార్థుల రక్షణకోసం ఒక సంరక్ష కుని ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులను ఇంటినుంచి పాఠశాలకు తీసుకు వచ్చే సమయంలో అదే విధంగా పాఠశాల ముగిసిన తరువాత ఇంటికి తీసుకెళ్లే క్రమంగా వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సాలా పక్షి వెంకయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎం.పీ.పీ ఉన్నం నిర్మలమ్మ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్15:**
శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పొయ్య పంచాయతీ పరిధిలో ఉన్న గాబచేను గ్రామంలో సాలా పక్షి వెంకయ్య అనారోగ్య కారణంతో మృతి చెందారు. విషయం తెలు సుకున్న జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు సతీమణి మండల ఎం.పీ.పీ ఉన్నం నిర్మలమ్మ వెంకటయ్య భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి దహన క్రియల ఖర్చులకు తన వంతు సహాయం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) నేడు రద్దు

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 15:**



కుప్పం పట్టణంలోనిఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే)ను రద్దు చేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఓ ప్రకటనలో తెలియజేశారు. అనివార్య కారణాలతో వచ్చే వారానికి వాయిదా పడింది. ఈ విషయాన్ని అర్జీదా రులందరూ ప్రజలు గమనించాలని తెలియజేశారు.

## వైద్య శిబిరాన్ని ప్రారంభించిన

# ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్




**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 15:**
కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం, చిత్తూరు ఆధ్వర్యంలో ఆదివారం విజయం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గారు ప్రారంభించారు. పేదలకు అవసరమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే ఈ ప్రయత్నాన్ని అభినందించారు. బెంగళూరు కమ్మవారి సంఘం స్థాయిలో చిత్తూరు కమ్మవారి అభ్యుదయ సేవా సంఘాన్ని అభివృద్ధి చేసి విస్తృతంగా సేవా కార్యక్రమాల నిర్వహించాలని, ఇందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తామన్నారు. చిత్తూరులో కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య శిబిరంలో ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, తెదేపా అధికార ప్రతినిధి వి. సురేంద్ర కుమార్, కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు, తిరుపతి అమర హాస్పిటల్ వైద్యులు, స్థానిక ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

## 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని

# కంగుందికోటలలో యోగ అవగాహన కార్యక్రమం





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 15:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యోగాంధ్ర ఆరోగ్య ఆంధ్రమాసోక్షవాలలో భాగంగా రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సూచనల మేరకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్య క్షులు పిఎస్ మణిరత్నం, రాజశేఖర్ సమక్షంలో జిల్లా పర్యాటక అధికారి, డిఎస్‌డిఓ బాలాజీ ఆధ్వర్యంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, కుప్పం తాసిల్దారు చిట్టి బాబు, కంగుందిలో ఆదివారం ఉదయం నిర్వహించిన యోగాంధ్ర ఆరోగ్య ఆంధ్ర కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు ధనశేఖర్, దివాకర్, కుప్పం నియోజకవర్గ టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్, రామకుప్పం మండల అధ్య క్షులు ఆనంద్ రెడ్డి, హేమంబర్ గౌడ్, ఆర్ఆర్ రవి, కదిరిప్ప, కుప్పం నియోజక వర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు బెండనకుప్పం బాబు,రాజారామ్, మంజునాథ్, కన్నన్, బిజెపి తులసీనాథ్, జనసేన నరేష్, కూటమి సభ్యులు, విద్యార్థులు పెద్దలు, గ్రామ సచి వాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి వి.కోట సమస్యలు



**వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**
వీ.కోటమండల రైతులసమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యవసాయ శాఖమంత్రి అచ్చం నాయుడును మండల పార్టీ అధ్యక్షులు రంగనాధ్ ఆధ్వర్యంలో టిడిపినేతలు కలసి వినతిపత్రం సమర్పించారు. ఒక్కరోజు చిత్తూరుజిల్లా పర్యటనకు శనివారం విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వారికి మండల రైతుల సమస్యలనువిన్న వించారు. వీకోటలో మామిడికాయల రైతులకు గిట్టుబాటు ధరకల్పించాలని, రైతులకు అవసరమైన మేరకు వేరుశనగ విత్తనాలు అందించాలని నేతలుమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో రైతులు అధిక భాగం వర్షాలపై ఆధారపడి వేరుశనగ పండిస్తుంటారని ఒక రైతుకు ఒక బస్తా వేరుశనగ విత్తన కాయలు సరిపోనందున రైతులకు అవసరమైన మేరకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయాలని వారు కోరారు. అదేవిధంగా మండలంలో ఉపాధి హామీ పథకం కింద విస్తారంగా మామిడి తోటలు నాటడం జరిగిందని, మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని విన్నవించారు. పడమట సరిహద్దు ప్రాంతాలతో పాటు వీకోట మరి యు బైరెడ్డి పల్లి మండల పరిసరప్రాంతాల్లో మామిడిపై ఆధారపడ్డ రైతులకు మెరుగైన గిట్టు బాటు ధర కల్పించాలని తెలుగుదేశం పార్టీ నేతలుమంత్రిని కోరారు. వీటితోపాటు మండల పరిధిలోని దీర్ఘకాలిక రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని వారికి విన్నవించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ రైతు విభాగం అధ్యక్షుడు విశ్వనాధ్ రెడ్డి, మురుగేష్, చందు, జనార్దన్ రెడ్డి, కోదండ తదితరులు మంత్రిని కలిశారు.

# జననేతకు జన్మదిన దీవెనలు

**వెలుగు న్యూస్ కేవీబీపురం**
సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం జనసేన పార్టీ మండల ఆధ్యక్షుడు వి. థామస్ పుట్టిన రోజును ఘనంగా జరిపించిని జనసైనికులు, ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ మండల ఆధ్యక్షుడు బి. రామోంజుల నాయుడు, టీడీపీ రైతు విభాగ ఆధ్యక్షుడు కనపర్తి గోపినాథ్ రెడ్డి బీజేపీ మండలపార్టీ ఆధ్యక్షుడు నల్లిబాబు థామస్‌కి ఆశీర్వచనాలు అందచేశారు. కేవీబీపురం మండల కేంద్రంలోని సాయి బాబా గుడిదగ్గర జనసేన పార్టీ మండల ఆధ్యక్షుడు వి. థామస్ పుట్టిన రోజును సత్యవేడు నియోజక వర్గ జనసేన పార్టీ ఇంచార్జి కొప్పుల లావణ్య కుమార్, ఉమ్మడి చిత్తర్‌జిల్లా కార్యదర్శి హేమకుమార్ సూచనల ప్రకారం జనసైనికులు పిడుగు విజయకుమార్, కొమ్మ సతీష్, వి. రాజేష్, విజయ్, సిద్ధు, ప్రశాంత్,విమల్ సందీప్, హరీష్ గార్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.రాజశేఖర్, శరవణ, నరేష్, కర్రేయ్య టీచర్, తది తర

# నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్

స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.. ఈ నెలాఖరులోగా స్థానికఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని పేర్కొన్నారు. సోమవారం కేబినెట్‌లో చర్చించాక ఎన్నికల తేదీపై స్పష్టత వస్తుందని మంత్రి పొంగులేటి వివరించారు. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల అనంతరం.. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని మంత్రి పొంగులేటి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు 15 రోజుల గడువు మాత్రమే ఉందని.. కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. గెలిచే అవకాశాలున్న అభ్యర్థులనే ఎంపిక చేస్తామని స్పష్టంచేశారు. కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి మండలం, తిరుమలాయపాలెం మండలం, నేలకొండపల్లి మండలానికి చెందిన ముఖ్య నాయకులతో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమావేశం నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా సమావేశం నిర్వహించిన మంత్రి ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై మాట్లాడారు. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ వస్తుందని పేర్కొన్నారు. నాయకులు ఎవరైనా ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుని ఎన్నికలకు సిద్ధం అవ్వాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్న అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామని పొంగులేటి పేర్కొన్నారు. రాబోవు వారం రోజుల్లోనే అర్హులైన రైతు సోదరులందరికీ కుంట మొదలుకోని ఎన్ని ఎకరాలుంటే అన్ని ఎకరాల వరకు రైతు భరోసా, సన్నాలకు రైతు బోనస్ వారి వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాల ఆవశ్యకతను ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నాయకులదేనని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించుకోవడమే కాదు వాటి నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత కూడా నాయకులే చూసుకోవాలన్నారు.

రాబోయే వారం రోజుల్లోనే అర్హులైన రైతు సోదరులందరికీ కుంట నుంచి ఎన్ని ఎకరాలుంటే అన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సన్నాలకు రైతు బోనస్ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని అన్నారు. సంక్షేమ పథకాల ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నాయకులదేనని చెప్పారు. మీ గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించుకోవడమే కాదని.. వాటి నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత కూడా నాయకులే తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

**రైతులకు ఏరువాక శుభాకాంక్షలు..**

'అమితంగా ప్రేమించే పాలేరు నియోజకవర్గ రైతన్నలు ఏర్పాటు చేసుకున్న ఏరువాక కార్యక్రమంలో పాలుపంచుకున్నాను. ఆరుగాలం కష్టపడి దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించే రైతులకు ఏరువాక శుభాకాంక్షలు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్న తర్వాత రాష్ట్రంలో అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. రైతును రాజు చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయిన ఈనాడు మా ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం ఇస్తోంది. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తోంది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇబ్బంది లేకుండా అందిస్తున్నాం. గత కేసీఆర్ ప్రభుత్వం వారి స్వార్థం కోసం మొదలుపెట్టిన సీతారామ ప్రాజెక్ట్‌ను వదిలేస్తే, వాటిని పూర్తి చేస్తూ సాగునీరు ఇబ్బందులు లేకుండా ఒక్క ఎకరానికి ఇబ్బంది లేకుండా నీటిని అందిస్తున్నాం. ఆ భగవంతుడి దయతో ఈ సంవత్సరం పదిహేను రోజుల ముందే నైరుతి రుతుపవనాలు పలకరించాయి. వ్యవసాయ సీజన్ కూడా మొదలైంది' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

**రేపటి నుంచి రైతు భరోసా..**

'ఆనాటి ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు రైతు బంధు ఇస్తే జూన్ 16 నుంచి వ్యవసాయానికి యోగ్యమైన ప్రతి ఎకరానికి పెట్టుబడి కోసం రూ. 12 వేలు మా ప్రభుత్వంలో ఇస్తాం. రాష్ట్ర ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆనాటి ప్రభుత్వం రూ.17 వేల కోట్లు రుణమాఫీ చేస్తే, ఇందిరమ్మ ప్రభుత్వం రూ. 21 వేల కోట్లు రుణమాఫీ చేసింది. రైతు భరోసా ఇప్పటికే రెండు సార్లు ఇచ్చాం. రేపటి నుంచి మూడోసారి ఇస్తాం. వరి వేస్తే ఉరే అని గత కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టింది. పేదల, రైతు పక్షపాత ప్రభుత్వంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. అయినా దేశంలో ధాన్యం పండించిన రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ఉచిత కరెంట్, రైతు భరోసా ,నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నాం. ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోంది. రాష్ట్రంలో రైతులు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడు ఆశీర్వదించాలి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోరుకున్నారు.

## బీఆర్ఎస్ నేతలపై పెట్టే కేసుల ఎఫ్ఐఆర్‌లు..

# గాంధీ భవన్‌లో రెడీ అవుతున్నాయి



బీఆర్ఎస్ నేతలపై పెట్టే కేసుల ఎఫ్ఐఆర్‌లు గాంధీభవన్‌లోనే రెడీ అవుతున్నాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో సీక్రెట్ ఎఫ్ఐఆర్‌లు తయారవుతున్నాయని.. వాట్సాప్‌లో స్టేటస్ పెట్టినా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులపై పెడుతున్న అక్రమ కేసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై పెడుతున్న కేసులన్నీ తప్పుడు కేసులే అని ఒక మాజీ పోలీసు అధికారిగా చెబుతున్నానని స్పష్టం చేశారు. . కొణతం దిలీప్‌పై ఆదిలాబాద్ జిల్లాలో అక్మ కేసులు పెట్టారని.. ఆయన్ను నిర్మల్ పోలీసులు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిర్మల్ కోర్టు మెజిస్ట్రేట్ దిలీప్‌కు బెయిల్ ఇస్తే వెంటనే కడెం పోలీసులు వచ్చారని పేర్కొన్నారు. ఇదెక్కడి ఆటవిక న్యాయమని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో సీక్రెట్ ఎఫ్ఐఆర్‌లు అవుతున్నాయని మండిపడ్డారు. వాట్సాప్‌లో స్టేటస్‌లు పెట్టినా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోర్త్ సిటీ పేరుతో రేవంత్ రెడ్డి ఫోర్ బ్రదర్స్ సిటీ అంటున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి రూ.200 కోట్లతో అందాల పోటీలు పెట్టి తెలంగాణకు తలవంపులు తీసుకొచ్చారని మండిపడ్డారు. ఇంగ్లండ్‌కు చెందిన మ్యాగీ మిల్లా అనే మిస్ వరల్డ్ కంటెస్టెంట్ తనకు అవమానం జరిగిందని పోటీ నుంచి తప్పుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ నేతలు అసభ్యంగా ప్రవర్తించడంతో మ్యాగీ మిల్లా అందాల పోటీ నుంచి తప్పుకున్నారని పేర్కొన్నారు. స్ ఇంగ్లండ్ మాగీ మిల్లాకు తెలంగాణ ప్రజల తరపున కేటీఆర్ క్షమాపణ చెప్పారని గుర్తుచేశారు. కేటీఆర్ అమెరికా వెళ్లి తెలంగాణ గురించి మాట్లాతున్నందుకు, చెన్నై వెళ్లి దక్షిణ భారత దేశానికి జరుగుతున్న అన్యాయంపై మాట్లాడుతున్నందుకు కేసులు పెడుతున్నారా అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేస్ పై అసెంబ్లీలో చర్చ ఎందుకు పెట్టలేదని రేవంత్ రెడ్డిని నిలదీశారు. కేటీఆర్ లై డిటెక్టర్ టెస్ట్ కు సిద్ధమని అంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేస్ లో అసలు నిందితుడు రేవంత్ రెడ్డి అని కేసు పెట్టాను .కానీ నాకు తెలియకుండానే పోలీసులు కేసును క్లోజ్ చేశారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సీఎం కాబట్టి కేసు పెట్టలేదని పోలీసులు అంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డికి ఒక న్యాయం, ఇంకొకరికి ఇంకో న్యాయం చట్టంలో ఉందా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సోదరుల దౌర్జన్యంతో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని.. అతనిపై చర్యలేవని నిలదీశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే లై డిక్టేటర్ టెస్ట్ కు, బహిరంగ విచారణకు రావాలని సవాలు విసిరారు. కేటీఆర్‌కు ఇచ్చిన నోటీసులను వెంటనే విత్‌డ్రా చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ కార్ రేసు వ్యవహారంలో కేటీఆర్‌పై పెట్టిన కేసులపై న్యాయస్థానాలను తప్పకుండా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

# బీజేపీలోకి స్వప్న?

**కొద్ది రోజులుగా కాంగ్రెస్‌కు దూరందూరం**

**పార్టీలో ప్రాధాన్యత లేదని సన్నిహితుల వద్ద ఆవేదన**

**కాషాయ కండువా కప్పుకొనేందుకు ఏర్పాట్లు**

**తాండూరు:** మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ కాంగ్రెస్‌ను వీడి కాషాయదళంలో చేరనున్నా రా..? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. అధికార పార్టీలో తనకు సరైన గౌరవం దక్కడం లేదని అసంతృప్తిగా ఉన్న ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇది తాండూరులో హాట్‌టాపిక్‌గా మారింది. పలువురు మాజీ కౌన్సిలర్లు సైతం స్వప్న బాటలో నడవనున్నట్లు సమాచారం.

మహేందర్‌రెడ్డి వర్గం నుంచి..

2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పట్నం మహేందర్‌రెడ్డి వర్గం నుంచి చైర్‌పర్సన్ అభ్యర్థిగా స్వప్న రేసులోకి వచ్చారు. మరో వైపు ఇదే పార్టీ నుంచి రోహిత్‌రెడ్డి వర్గం తరఫున పట్లోల్ల దీపనర్సింహులు చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీచేశారు. 36 వార్డులున్న తాండూరులో మహేందర్‌రెడ్డి వర్గీయులు ఎక్కువమంది కౌన్సిలర్లుగా గెలుపొందారు. దీంతో చైర్‌పర్సన్ కుర్చీ కోసం పోటీ నెలకొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు నాయకులు కల్పించుకుని, చైర్‌పర్సన్ పదవీకాలాన్ని ఇద్దరూ చెరి సగం పంచుకోవాలని సూచించారు. మొదటిసారి స్వప్నకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో దీపకు వైస్ చైర్‌పర్సన్ కుర్చీ ఇచ్చి బుజ్జగించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, కోర్టు కేసుల నేపథ్యంలో పదవీ కాలమంతా స్వప్ననే కొనసాగారు. ఈ నేపథ్యంలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించిన ప్రతీసారి గొడవలే జరిగాయి.





**రాష్ట్ర కమిటీ ఎన్నిక తర్వాతే..**

గత అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత స్వప్న కాంగ్రెస్‌లో చేరారు. అయితే పదవీ కాలం ముగిసిన తర్వాత ఆమె పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి ఆమెకు ఆహ్వానం ఆగిపోయింది. ఈ విషయమై తన సన్నిహితుల వద్ద పలుమార్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఈక్రమంలోనే బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల పలు కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర కమిటీ నియామకం తర్వాతే కాషాయ తీర్థం పుచ్చుకుంటారని తెలుస్తోంది.

## ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీ తగ్గించండి



-మొదటిపేజీ తరువాయి

నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసే రూ.300 కోట్లలో టొబాకో బోర్డు రూ.150 కోట్లు భరించేలా చూడాలంటూ కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి అంశాలను టొబాకో బోర్డు ద్వారా నియంత్రించేలా చట్ట సవరణ చేయాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కోరారు. ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 10 శాతానికి తగ్గించడంపై పునరాలోచన చేయాలని పీయూష్ గోయల్‌ను చంద్రబాబు కోరారు. దిగుమతి సుంకం తగ్గించడం వల్ల రాష్ట్రంలోని పామాయిల్ రైతులకు సరైన ధర రావడం లేదని.. తీవ్రంగా నష్టపోతారని కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయం.. కేంద్రం నిర్దేశించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ లక్ష్యాలకూ ఇబ్బందికరంగా ఉంటుందనే విషయాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ఆక్వా ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల విషయంలో ఆ దేశంతో చర్చలు జరపాలని సీఎం చంద్రబాబు సూచించారు. సీఫుడ్‌పై అమెరికా విధించిన 27 శాతం సుంకం ఏపీలోని 8 లక్షల మంది ఆక్వా రైతులపై ప్రభావితం చూపుతోందని సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. ఏపీ ఆక్వా రైతులపై ఈ భారాన్ని తగ్గించేలా చొరవ తీసుకోవాలని కేంద్రమంత్రికి విన్నవించారు. మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ని సీఎం చంద్రబాబు కోరారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్టు పీయూష్ గోయల్‌కు సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

## ప్రభుత్వ బడుల్లో అత్యాధునిక సాంకేతిక బోధన..

-మొదటిపేజీ తరువాయి

ఆకర్షితులై రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు వివిధ సంస్థలు ముందుకొస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలో ఏక్ స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేధ ఆధారిత ప్లాట్‌ఫామ్‌తో 540 పాఠశాలల్లో పనిచేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది.

## తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమే



-మొదటిపేజీ తరువాయి

చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన 200 టీఎంసీల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్ట్ డిజైన్, కేంద్రానికి పీఎఫ్ఆర్ సమర్పించడం.. తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమేనని ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు ఆ లేఖలో స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌ను కేంద్రం ఆమోదించే లోపే.. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉండగా.. ఏపీ ఏకపక్షంగా ముందుకు వెళ్లుతుండడం అన్యాయమన్నారు. అయితే రెండు రోజుల క్రితం ఇదే అంశంపై కేంద్ర జలశక్తి మంత్రికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్‌ను ఆ లేఖలో వ్యతిరేకించడం పట్ల మంత్రి ఉత్తమ్‌ను హరీశ్ రావు పొగడ్తలతో ముంచెత్తారు. ఏపీ తీసుకుంటున్న చర్యలు.. 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంతోపాటు నది జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘిస్తుందని.. దీనిపై వెంటనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్రాన్ని కోరాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తగు చర్యలు తీసుకోవాలని.. అలాగే రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ మీకు తోడుగా నిలుస్తుందని ఆ లేఖలో హరీశ్ రావు స్పష్టం చేశారు. మరోవైపు బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ నిర్మిస్తుండం.. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండడంతో శనివారం హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఇంకోవైపు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రాజెక్టల నిర్మాణం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఆ క్రమంలో వాటి గురించి ఆయన స్వయంగా కేంద్రం వద్దకు వెళ్లి చర్చిస్తున్నారు. కానీ తెలంగాణలో ఆ పరిస్థితి లేదు. రాష్ట్రంలో ప్రాజెక్టల నిర్మాణాలకు అనుమతి కూడా తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బనకచర్ల వల్ల గోదావరి జలాల్లో తెలంగాణ వాటా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన లేఖ రాశారు.

## కోరుట్లలో విషాదం.. విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి..

## ఆరుగురికి గాయాలు

**జగిత్యాల:** కోరుట్లలో విషాదం చోటు చేసుకుంది. వినాయక విగ్రహాలు తరలిస్తుండగా ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ దుర్ఘటనలో మృతులు బంటిసాయి,వినోద్‌లుగా గుర్తించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాలాజీ కళా ఆర్ట్స్ విగ్రహాల తయారి యజమాని అల్వాల వినోద్, బంటి సాయి అనే ఇద్దరు యువకులు కోరుట్ల పట్టణం శివారులోని వినాయక విగ్రహాల తయారు చేస్తున్నారు. అయితే, ఆదివారం షెడ్డులో ఉంచిన విగ్రహాలు తడిగా ఉండటంతో ఎండలో ఆరబెట్టేందుకు పక్కనే ఉన్న మరో షెడ్డుకు తరలించే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో కొండ్రికర్ల నుండి వచ్చే 133/11 కేవీ విద్యుత్ వైర్లకు 13అడుగుల వినాయక విగ్రహం తగిలింది. దీంతో ఆరు నుంచి తొమ్మిదిమందికి విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ షాక్‌తో విలవిల్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలారు. ప్రమాదంతో అప్రమత్తమైన స్థానికులు కర్రల సాయంతో కరెంట్ షాక్ ప్రమాదాన్ని నిలువరించారు. అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుల్లో ఇద్దరు మృతి చెందారు. మిగిలిన బాధితులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

## దాడికి పాల్పడ్డ తండ్రి, కొడుకును అరెస్టు చేయాలని గ్రామస్థుల రాస్తారోకో

**దండేపల్లి :** మంచిర్యాల జిల్లా మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ మల్టిపర్పస్ వర్కర్ ప్రభాకర్‌పై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గ్రామానికి చెందిన తండ్రి, కుమారుడు భారతారపు లింగయ్య, కుమారస్వామి భూమి విషయమై మహిళతో గొడవపడ్డారు. ఆమె జీపీ మల్టిపర్పస్ వర్కర్ ప్రభాకర్‌కు విషయాన్ని వివరించడంతో అతడు అక్కడికి చేరుకున్నాడు. దివ్యాంగుడైన ప్రభాకర్‌ను తండ్రి, కొడుకులు చితకబాదడడంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అతడిని

## వీకోట కవులకు "కళాజ్యోతి" జాతీయ పురస్కారాలు

**వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 15:**



వి.కోటమండలానికి చెందిన ముగ్గురు కవులకు "కళాజ్యోతి" జాతీయ పురస్కా రాలు లభించాయి. చిత్తూరుజిల్లా కేంద్రం లో ఆదివారం భారతీయతెలుగు రచయి తల సమాఖ్య మరియు ఎం.వీ. కేశవ రెడ్డి స్మారక ఫౌండేషన్ చిత్తూరువారి సంయుక్త ఆధ్వర్యంలో "తెలుగుతేజాలకు కళాభిషే కం "గొప్పకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజ్యోతి జాతీయపురస్కా రాలు 2025-అంద జేశారు.దేశనలు మూలల నుండి తెలుగు బుక్ రికార్డ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ కోసంచిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన ద్విశతా ధిక,కవులు,వివిధ సాహితీ కళాకారులను సన్మానించారు. ఈ సన్మానకార్యక్రమం లో వి. కోట కు చెందిన కవులు డాక్టర్ కవికోకిల కొంరారి వెంకటరత్నం, డాక్టర్ గడ్డం శాంతకుమారి, డాక్టర్ వి.రఘుపతి లకు చోటు దక్కింది. ఈ కార్యక్రమలో సినీ ప్రముఖ నటులు పద్మశ్రీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్,ప్రముఖ సినీగీత రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ,డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ ,స్థానిక శాసన సభ్యులు గురుజాల జగన్మోహన్ ,కఠారి హేమలత, మర్రిపూడి దేవేంద్ర రావు, డాక్టర్ నారాయణ స్వామి, డాక్టర్ మర్రి శశిధర్ రెడ్డి ప్రముఖసంఘ సేవకులు,సహదేవనాయుడు, ఎం ఆర్ అరుణ కుమారి వండర్ బుక్ఆఫ్ వరల్డ్ కార్డ్ అధికారులు, ప్రముఖసినీ ప్రముఖు లు వీరి ముగ్గురిని ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు,జ్ఞాపికలను అందజే శారు. వీ కోట ప్రాంత కవులకు జాతీయ పురస్కారాలు లభించడంపట్ల పురప్రము ఖులు,సాహితీ ప్రియులు అభినందనలు తెలియజేశారు..

## ఐపీఓకు ముందు రూ.260 కోట్లు సమీకరించిన హీరో ఫిన్‌కార్ప్




**ఇంటర్నెట్ డెస్క్:** ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ ఆర్థిక సేవల విభాగం హీరో ఫిన్‌కార్ప్ లిస్టింగ్‌ను వేగవతం చేస్తోంది. అందులో భాగంగానే ఐపీఓకు ముందు రూ.260 కోట్లను సమీకరించింది. దీంతో పబ్లిక్ ఇష్యూలో విక్రయించాల్సిన తాజా షేర్ల మొత్తం రూ.2,100 కోట్ల నుంచి రూ.1,840 కోట్లకు తగ్గింది. మొత్తం ఐపీఓ పరిమాణం రూ.3,668 కోట్ల నుంచి రూ.3,408 కోట్లకు తగ్గింది. ఇందులో రూ.1,568 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి పెట్టారు. జూన్ 5న కంపెనీ నిర్వహించిన ప్రీ- ఐపీఓ రౌండ్‌లో 12 మంది పెట్టుబడిదారులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒక్కో షేరు రూ.1,400 చొప్పున 18.57 లక్షల వాటాలను వారికి కేటాయించింది. దీని ద్వారా రూ.260 కోట్లు సమీకరించింది. హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓ ప్రణాళికను గతేడాది ప్రకటించింది. నాటి నుంచి వీటి పబ్లిక్ ఇష్యూ రాక కోసం మదుపర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మేలో సెబీ నుంచి ఐపీఓకు అనుమతి లభించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్ని భవిష్యత్తు రుణ కార్యకలాపాల కోసం కంపెనీ మూలధనాన్ని పెంచేందుకు ఉపయోగించనుంది. హీరో ఫిన్‌కార్ప్ నాన్- బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ. రిటైల్, సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి వ్యాపారాలకు రుణాలు అందిస్తోంది. 2024 మార్చి నాటికి కంపెనీ ఆస్తులు రూ.51,821 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీకి 1.18 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు.

# పెరుగుతున్న అపార్ట్‌మెంట్ లోడింగ్



నివాస విభాగాన్ని కరోనా కంటే ముందు, ఆ తర్వాత అని విభజించే పరిస్థితులు వచ్చాయి. కోవిడ్ కంటే ముందు వరకూ అపార్ట్‌మెంట్ విస్తీర్ణంలో కార్పెట్ ఏరియాకే అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. అంటే ఫ్లాట్ ఏరియాలో వాస్తవంగా గృహ యజమాని వినియోగించే స్థలం ఎంత ఉందని చూసుకునేవారు. కానీ, కోవిడ్ తర్వాత నుంచి కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులు వచ్చాయి. ఫ్లాట్‌లో నివాసితుడు వినియోగించే స్థలం కంటే క్లబ్‌హౌస్, పార్క్, గార్డెన్, లాబీ వంటి వసతులకు ఎంత స్థలం కేటాయిస్తున్నారనే దానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. లగ్జరీ లైఫ్ స్టయిల్‌ను కోరుకునే యువ జనరేషన్ పెరుగుతుండటంతో అపార్ట్‌మెంట్‌లో కార్పెట్ ఏరియా క్రమంగా తగ్గుతోందని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌లో ఫ్లాట్ల స్థలంతో పాటు లిఫ్ట్, మెట్లు, క్లబ్‌హౌస్, పార్క్ ఇతరత్రా వసతుల కోసం కేటాయించిన స్థలాన్ని కూడా కలిపితే దాన్ని సూపర్ బిల్టప్ ఏరియాగా పేర్కొంటారు. ఇక, ఫ్లాట్‌లో వాస్తవంగా గృహ యజమాని వినియోగించే స్థలం(గోడ నుంచి గోడ వరకూ ఉండే స్పేస్)ను కార్పెట్ ఏరియాగా పేర్కొంటారు. కరోనా మహమ్మారి కంటే ముందు వరకూ గృహ కొనుగోలుదారులు కార్పెట్ ఏరియాకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా.. కోవిడ్ తర్వాత నుంచి కార్పెట్ కంటే అపార్ట్‌మెంట్‌లోని వసతులకు(లోడింగ్) ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1) నాటికి దేశంలోని ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్ లోడింగ్ 40 శాతానికి చేరుకుంది. 2019లో ఇది 31 శాతంగా ఉంది. నివాస సముదాయాలలో అధునిక వసతులు, సౌకర్యాలు పెరుగుతున్నాయి. దీంతో ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్ల లోడింగ్(వసతులు)పెరుగుతోంది. విలాసవంతమైన జీవనశైలి కారణంగా గృహ కొనుగోలుదారులు అధిక వసతులు, సౌకర్యాలను కోరుతున్నారు.

### వసతులకు ప్రాధాన్యం

దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్లలోని మొత్తం స్థలంలో 60 శాతం నివాసయోగ్యమైన స్థలం కాగా మిగిలిన 40 శాతం సాధారణ ప్రాంతం. లిఫ్ట్, లాబీ, మెట్లు, క్లబ్ హౌస్, వసతులు, టెర్రస్ వంటి కామన్ ఏరియాలు. కరోనా కంటే ముందు వరకూ 30 శాతం కంటే తక్కువ లోడింగ్ సాధారణంగా భావించేవారు. కానీ, కరోనా తర్వాతి నుంచి విలాసవంతమైన జీవనశైలి అలవాటైపోయింది. ప్రాజెక్ట్ చిన్నదైనా, పెద్దదైనా ఆధునిక వసతులు ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లలో నివాసయోగ్యమైన స్థలం కార్పెట్ ఏరియా తగ్గుతుంది. గృహ కొనుగోలుదారులు ప్రాథమిక జీవనశైలి సౌకర్యాలతో సంతృప్తి చెందడం లేదు. ఫిట్‌నెస్ కేంద్రాలు, క్లబ్ హౌస్, పార్క్, గార్డెన్, గ్రాండ్ లాబీలు ఉండాలని కోరుకుంటున్నారు.

### రీసేల్ విలువ పెరుగుదల..

లోడింగ్ పెరిగితే కమ్యూనిటీ నివాస యోగ్యత, రీసేల్ విలువలను కూడా పెరుగుతుంది. అయితే గృహ కొనుగోలుదారులు తమ అపార్ట్‌మెంట్లలో వాస్తవంగా ఉపయోగించే స్థలాన్ని కోల్పోతారు. ప్రతి ప్రాజెక్ట్‌లో అపార్ట్‌మెంట్‌లోని మొత్తం స్థలంలో గృహ కొనుగోలుదారులు వాస్తవంగా ఉపయోగించే స్థలం, సౌకర్యాల కోసం కస్టమర్లు ఎంత చెల్లిస్తున్నారో స్పష్టంగా పేర్కొనేలా రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) నిబంధనలు రూపొందించాలి. దీంతో కస్టమర్లు చెల్లించే సొమ్ములో దేనికెంత వ్యయం అవుతుందో స్పష్టత ఉంటుంది.

### లోడింగ్ శాతాన్ని ఎలా లెక్కిస్తారంటే..

సూపర్ బిల్టప్ ఏరియా నుంచి కార్పెట్ ఏరియాను తీసి వేసి, కార్పెట్ ఏరియాతో భాగించాలి. వచ్చిన ఫలితాన్ని వందతో గుణిస్తే వచ్చేదే లోడింగ్ శాతం. ఉదాహరణకు.. హైదరాబాద్‌లో మీరు 1,500 చ.అ. అపార్ట్‌మెంట్ కొంటున్నారని అనుకుందాం. ఇందులో ఫ్లాట్‌లో కస్టమర్ వినియోగించే స్థలం 750 చ.అ.లే ఉంటుంది. మిగిలిన స్థలం లిఫ్టు, లాబీ, మెట్లు, క్లబ్ హౌస్ వంటి కామన్ ఏరియాలు ఉంటాయి. అంటే ఫ్లాట్ ఖరీదులో కస్టమర్ వాస్తవంగా వినియోగించే కార్పెట్ ఏరియాతో పాటు కామన్ ఏరియా కూడా కలిపే ఉంటుందన్నమాట.

### నగరంలో లోడింగ్ 38 శాతం..

హైదరాబాద్‌లో లోడింగ్(వసతులు) శాతం 2019లో 30 శాతంగా ఉండగా.. 2022 నాటికి 33కు, ఈ ఏడాది క్యూ1 నాటికి ఏకంగా 38 శాతానికి పెరిగింది. 2025 క్యూ1 నాటికి దేశంలోని ప్రధాన నగరాలలో అత్యధికంగా 43 శాతం లోడింగ్‌తో ముంబై ప్రథమ స్థానంలో నిలిచింది. 2019లోనూ ఈ ఆర్థిక నగరంలో అత్యధిక లోడింగ్ 33 శాతంతో టాప్‌లో నిలిచింది. అత్యల్పంగా 36 శాతం లోడింగ్‌తో చెన్నై చివరి స్థానంలో నిలిచింది. 2019లో ఇక్కడ లోడింగ్ 30 శాతంగా ఉంది. ఏటేటా బెంగళూరులో అపార్ట్‌మెంట్ లోడింగ్ క్రమంగా పెరుగుతోంది. 2019లో ఇక్కడ 30 శాతం లోడింగ్ ఉండగా.. 2025 క్యూ1 నాటికి ఏకంగా 41 శాతానికి పెరిగింది. 2022లో ఇది 35 శాతంగా ఉంది. గత ఏడేళ్లలో బెంగళూరులో సగటు లోడింగ్ అత్యధిక శాతం వృద్ధిని నమోదు చేస్తూ ఉంది. ఎన్‌సీఆర్ లో 2019లో లోడింగ్ శాతం 31 శాతం నుంచి 2025 క్యూ1 నాటికి 41 శాతానికి చేరింది. పుణేలో 32 శాతం నుంచి 40కు, కోల్‌కతాలో 30 శాతం నుంచి 39 శాతానికి పెరిగింది.

## ఎంజీ మోటార్ ఆఫర్.. ఈవీపై రూ.4.4 లక్షలు డిస్కౌంట్!

**ఇంటర్నెట్ డెస్క్:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఎంజీ మోటార్ తన ఈవీ కార్లపై భారీ డిస్కౌంట్ ప్రకటించింది. భారత్ మార్కెట్లోకి అడుగు పెట్టి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రత్యేక ఆఫర్ తీసుకొచ్చింది. తన తొలి ఎలక్ట్రిక్ వాహనం జెడ్ఎస్ ఈవీపై ఏకంగా రూ.4 లక్షల తగ్గింపు ప్రకటించింది. పరిమిత కాలం మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. జెడ్ఎస్ ఎస్‌యూవీ ఎగ్జిక్యూటివ్ వేరియంట్‌పై రూ.13వేలు రాయితీ అందిస్తోంది. దీంతో ఈ కారు ధర రూ.16.88 లక్షల నుంచి రూ.16.75 లక్షలకు తగ్గింది. ఎక్సైట్ ప్రో వేరియంట్‌పై రూ.48వేలు డిస్కౌంట్ అందిస్తోంది. ఈ కారు ధర రూ.18.97 లక్షలు (ఎక్స్- షోరూమ్) కాగా.. ఆఫర్‌లో భాగంగా రూ.18.49 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. రూ.23.64 లక్షలున్న ఎక్స్‌క్లూజివ్ ప్లస్ వేరియంట్‌ను రూ.19.49 లక్షలకే లభిస్తుంది. టాప్-ఎండ్ ఎసెన్స్ వేరియంట్‌పై అత్యధిక డిస్కౌంట్ అందిస్తోంది. ఈవీ ధర రూ.24.93 లక్షలు (ఎక్స్- షోరూమ్) కాగా.. ఆఫర్‌లో భాగంగా రూ.20.49 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. అంటే ఏకంగా రూ.4.44 లక్షలు తగ్గింపు పొందొచ్చు. ఎంజీ మోటార్.. భారత మార్కెట్లోకి తీసుకొచ్చిన తొలి విద్యుత్ వాహనమే ఎంజీ జెడ్ఎస్. టాటా కర్వ్.ఈవీ, హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, మహీంద్రా బీఈ6 వంటి మోడళ్లకు పోటీగా తీసుకొచ్చింది. 50.3 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో తీసుకొచ్చిన ఈ కారు సింగిల్ ఛార్జ్‌తో 461 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు.



# ఆస్ట్రేలియా డబుల్ స్ట్రోక్.. టీమిండియాకు ఆరో ఓటమి!

యూరప్ గడ్డపై జరుగుతున్న హాకీ ప్రో లీగ్‌లో భారత జట్టు ఆరో ఓటమి ఎదురైంది. ఇప్పటికే నెదర్లాండ్స్, అర్జెంటీనా చేతిలో పరాజయంతో కుమిలిపోతున్న టీమిండియా.. ఆస్ట్రేలియా చేతిలో వరుసగా రెండో ఓటమిని చవి చూసింది. గత పోరులో ఆఖర్లో గోల్స్ సమర్పించుకున్న భారత్.. ఈసారి ప్రత్యర్థిని నిలువరించలేక మళ్లీ విజయం వాకిట బొక్కబోర్లాపడింది. శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సేన 2-3తో వెనకబడింది. గత మ్యాచ్‌లో మాదిరిగానే భారత ఆటగాళ్లు తొలి అర్ధ భాగంలోనే గోల్ సాధించారు. డిఫెండర్ సంజయ్ రానా 3వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ ద్వారా తొలి గోల్ అందించాడు. కానీ, ఆ తర్వాత ఆసీస్ ఆటగాళ్లు టిమ్ బ్రాండ్ (4వ నిమిషం), బ్లేక్ గోవర్స్ 5 వ నిమిషంలో గోల్స్ చేయగా భారత్ వెనకబడింది. అయితే.. దిల్‌ప్రీత్ సింగ్ 36వ నిమిషంలో గోల్ చేయగా టీమిండియా 2-2తో స్కోర్ సమం చేసింది. దాంతో 'హమ్మయ్య మ్యాచ్‌ను కాపాడుకుంటాం' అని హర్మన్‌ప్రీత్ సేన ధీమాగా ఉన్న వేళ.. భారత డిఫెండర్లను ఏమారుస్తూ కూపర్ బర్న్స్(36 నిమిషం) గోల్‌తో ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 27వ నిమిషంలో టీమిండియాకు రెండు పెనాల్టీ కార్నర్లు లభించాయి. కానీ.. వాటిని హర్మన్‌ప్రీత్ బృందం సద్వినియోగం చేసుకోలేకపోయింది. 400వ మ్యాచ్ ఆడుతున్న మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ తీవ్రంగా నిరాశపరిచాడు. మరో 10 నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా ఆసీస్ ఆటగాళ్లు రెండు పెనాల్టీ కార్నర్లు సాధించారు. అయితే.. గోల్ కీపర్ పాఠక్ వాటిని సమర్థంగా అడ్డుకోవడంతో ఒక్క పాయింట్ తేడాతో భారత జట్టు పరాజయం పాలైంది.వరుసగా ఆరు ఓటములతో డీలాపడిన టీమిండి తదుపరి మ్యాచ్‌లో జూన్ 21న బెల్జియంతో తలపడనుంది.



## కెప్టెన్‌గా చిరస్మరణీయ విజయాలు అందించా.. కానీ, నా జుట్టును కోల్పోయా..!



శ్రీలంక మాజీ కెప్టెన్ ఎంజెలో మాథ్యూస్ త్వరలోనే సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతున్న విషయం తెలిసిందే. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగబోయే తొలి టెస్టు అతడికి చివరి మ్యాచ్ కానుంది. రిటైర్మెంట్ వార్తను ఇప్పటికే ప్రకటించిన మాథ్యూస్ .. తన కెరియర్‌లోని పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. కెప్టెన్సీ సమయంలోనే తన జుట్టు ఎక్కువగా ఊడిపోయిందని చెప్పాడీ ఆల్‌రౌండర్. 'కెప్టెన్సీ చేపట్టిన తర్వాత నా జుట్టు చాలా పోయింది. నేను ఒక్కడినే కాదు లంకకు సారథ్యం వహించిన పలువురు ఆటగాళ్లకు కూడా పెద్దగా జుట్టు లేదు. ఎందుకంటే.. దేశానికి ప్రాతినిధ్యం వహించడం వేరు. జట్టును నడిపించడం వేరు. ప్రతిసారి అదనపు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతిఒక్కరు మనల్నే గమనిస్తారు. టీమ్ గెలిచినా, ఓడినా మనం ఏం చెబుతామో వినాలని కోట్లాది మంది ఎదురుచూస్తారు. అందుకు.. అప్పుడప్పుడు ఒత్తిడిగా అనిపిస్తుంది. అయినా.. నేను ఆ సవాళ్లతో కూడిన ప్రయాణాన్ని ఎంతగానో ఆస్వాదించాను. నాకు అవకాశం లభించింది. జట్టును మరొక స్థాయికి తీసుకువెళ్లాలి' అనే లక్ష్యంతో పని చేశాను అని మాథ్యూస్ వెల్లడించాడు. బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా లంక జట్టులోకి వచ్చిన మాథ్యూస్ 2013లో టెస్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 25 ఏళ్లకు పగ్గాలు అందుకున్న అతడు పిన్నవయస్కుడైన సారథిగా రికార్డు నెలకొల్పాడు. మాథ్యూస్ నేతృత్వంలోని లంక విదేశీ పర్యటనల్లో అద్భుతంగా రాణించింది. 2014లో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ విజేతగా నిలిచింది. అనంతరం వన్డే, టీ20 సారథిగానూ సేవలందించాడు మాథ్యూస్. అయితే.. 2017 జింబాబ్వే చేతిలో వన్డే సిరీస్ ఓటమితో అతడు మూడు ఫార్మాట్ల నుంచి కెప్టెన్‌గా వైదొలిగాడు.

## స్పోర్ట్స్

### అదే నాలో స్ఫూర్తి నింపింది.. ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసింది: మార్‌క్రమ్



**ఇంటర్నెట్ డెస్క్:** డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించి తన సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది దక్షిణాఫ్రికా. 27 ఏళ్ల అనంతరం ఆ జట్టు ఐసీసీ టైటిల్‌ను గెలిచింది. ఈ విజయం ఆ జట్టు ఆటగాళ్లతోపాటు అభిమానులకూ ఎంతో భావోద్వేగంతో కూడినదే. చివరి దాకా వచ్చి.. ఒత్తిడికి తలొగ్గే అలవాటున్న ఆ జట్టు ఈ సారి మాత్రం పట్టువిడవలేదు. ఆ జట్టు విజయంలో సెంచరీతో కీలకంగా నిలిచిన మార్‌క్రమ్ కూడా అదే చెప్పాడు. ఈ సారి టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదనే లక్ష్యంతో ఆడినట్లు వెల్లడించాడు. గత టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో టీమ్‌ఇండియాపై ఓటమి దక్షిణాఫ్రికాను తీవ్రంగా కుంగదీసిన విషయం తెలిసిందే. అప్పుడు తాను ఔట్ అయిన తర్వాత.. ఎంతో నిరాశకు గురయ్యానని.. మళ్లీ అలాంటి ఫీలింగ్ ఈ డబ్ల్యూటీసీ ఫైనల్‌లో రాకుడదని కోరుకున్నానని మార్‌క్రమ్ తెలిపాడు. ఆ ఆలోచనే తనలో స్ఫూర్తి నింపిందని.. వీలైనంత ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసిందని పేర్కొన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగిన మార్‌క్రమ్.. రెండో ఇన్నింగ్స్‌లో 136 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. "డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా.. గత టీ20 ప్రపంచకప్‌లో ఓటమి గురించి నేను చాలా ఆలోచించాను. టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఔట్ అయిన తర్వాత నేను ఒంటరిగా కూర్చుని ఎంతో నిరాశకు గురయ్యాను. మరోసారి అలాంటి పరిస్థితి రాకూడదని నిర్ణయించుకున్నాను. ఆ ఆలోచనే నాలో స్ఫూర్తినింపింది. అందుకే ఎక్కువ సేపు క్రీజులో ఉండగలిగాను" "ఇక సెంచరీ సాధించిన తర్వాత నేను చాలా భావేద్వేగానికి గురయ్యాను. జట్టు విజయం కోసం పోరాడుతున్నందుకు కన్నీళ్లు కూడా వచ్చాయి. ఇక చివరి రోజు జట్టు విజయానికి 69 పరుగుల దూరంలో ఉన్నప్పుడు.. అంతకుముందు రోజు రాత్రి నాకు నిద్ర పట్టలేదు. నిద్ర మాత్రలు తీసుకోవడానికి కూడా ప్రయత్నించాను. కానీ నాకు విశ్రాంతి దొరకలేదు. నా మనసు నిండా ఏవేవో ఆలోచనలు. అయితే.. చివరి రోజు మేం విజయం సాధించాం" అని మార్‌క్రమ్ భావోద్వేగానికి గురయ్యాడు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143